సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



'కిష్కింధపురి'లో ట్విస్ట్‌లు థ్రిల్ కలిగిస్తాయి 8లో



మహిళల టీ20 క్రికెట్ లీగ్ విజేత బ్లాస్టర్స్ 8లో



గోల్డెన్ రైడ్‌తో జైపూర్ థ్రిల్లింగ్ విక్టరీ 8లో

న్యూస్‌రీల్

బాలల సంరక్షణ, పునరావాసం చాలా ముఖ్యం



పలు శాఖల అధికారులతో చర్చిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాఖలీగల్: బాలల న్యాయ, రక్షణ చట్టాల అమలుపై అవగాహన ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు చిన్నంశెట్టి రాజు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. చట్టంతో విభేదిస్తున్న పిల్లలు–సంరక్షణ, రక్షణ అవసరమైన వారి సంరక్షణ, పునరావాసాన్ని మెరుగుపరచడం తదితర అంశాల గురించి వివరించారు. బాలల సంరక్షణ, పునరావాసం కోసం ఉన్న చట్టాలను, జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం వంటి వాటిని ఎలా సమర్థవంతంగా అమలు చేయాలన్న దానిపై చర్చించారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి మంగాకుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జువెనైల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి వరలక్ష్మి, పలు శాఖల అధికారులు, న్యాయవాదులు, న్యాయ అధికారులు పాల్గొన్నారు.

ఏజీపీగా న్యాయవాది సునీత



విశాఖ లీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది పిల్ల సునీత నగరంలోని ప్రధాన సివిల్ జ్యుడీషియల్ కోర్ట్ అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ న్యాయ వ్యవహారాలు సామాజిక న్యాయం కార్యదర్శి గొట్టపు ప్రతిభా దేవి ఉత్తర్వులు జారీ చేశారు. సునీత ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. జూనియర్ జ్యుడీషియల్ సివిల్ జడ్జి కోర్టులో ఆమె ప్రభుత్వం తరపున న్యాయవాదిగా ప్రాతినిధ్యం వహిస్తారు. సునీతకు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, కార్యదర్శి లాలం పార్వతి నాయుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, ఇతర న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు బుధవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతాయని పేర్కొన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

మేహాద్రి నుంచి 530 క్యూసెక్కుల నీరు విడుదల



మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ 2వ గేట్ నుంచి ఔట్‌ఫ్లో

పెందుర్తి: మేహాద్రి గెడ్డ జలాశయానికి నీటి ఉధృతి పెరగడంతో ఔట్‌ఫ్లోను అధికారులు పెంచారు. ఇప్పటి వరకు రెండవ గేటును మూడు అంగుళాల మేర ఎత్తి 178 క్యూసెక్కులు విడుదల చేస్తున్న అధికారులు మంగళవారం సాయంత్రం గేటును మరో ఆరు అంగుళాలు(మొత్తం 9 అంగుళాలు) ఎత్తారు. దీని ద్వారా 530 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. మంగళవారం రాత్రికి రిజర్వాయర్ నీటిమట్టం 60/61 అడుగులు ఉన్నట్లు నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తెలిపారు. మేహాద్రికి ప్రస్తుత ఇన్‌ఫ్లో కూడా దాదాపు 530 క్యూసెక్కులే ఉన్నట్లు పేర్కొన్నారు.

15న సింహగిరిపై కృష్ణాష్టమి

సింహాచలం: సింహగిరిపై ఈనెల 15న శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు మంగళవారం తెలిపారు. ఆరోజు రాత్రి శ్రీకృష్ణ జయంతి పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామన్నారు. 15న మధ్యాహ్నం 11.30 గంటల నుంచి 12.30గంటల వరకు కూడా స్వామివారి దర్శనాలు లభిస్తాయని, సాయంత్రం 6గంటల తర్వాత దర్శనాలు ఉండవని తెలిపారు. ఆరోజు ఆరాధన టికెట్లు లభించవన్నారు. 16న సాయంత్రం 4.30గంటలకు ఉట్ల సంబరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా ఈ విషయాలను గమనించాలని కోరారు.

అన్నదాత ఘోష పట్టదా



- ఎరువుల కోసం రైతులకు తిప్పలు
- రైతన్నకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం..
- అన్నదాత పోరులో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, రైతులు, కార్యకర్తలు

భీమునిపట్నం : రాష్ట్రంలో రైతులు ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన ఎరువుల కొరత ఎదుర్కొంటున్నారని, అలాగే ఉల్లి, టమాట పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చాలా దారుణంగా నష్టపోతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆందోళన వ్యక్తం చేశారు. 'అన్నదాత పోరు'లో భాగంగా మంగళవారం వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, రైతులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ పరిపాలన అధికారి సుధాకర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం



ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం అందిస్తున్న కె.కె.రాజు, మజ్జి శ్రీనివాసరావు

కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియంతలా వ్యవహరిస్తూ రైతులకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. రైతులకు ఎంతగానో ఉపయోగపడే రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి.. బ్లాక్ మార్కెట్‌లో ఇష్టం వచ్చినట్టు విక్రయాలు చేయడం దారుణమన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై పూర్తి అండగా ఉంటామని.. వారికి మేలు జరిగే వరకు పోరాడుతామని వెల్లడించారు. భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల కోసం ఎండలో రైతులు బారులు తీరి నిరీక్షిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం జాలి, దయ చూపడం లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు అండగా నిలబడి పోరాటాలు చేస్తామని, ఎన్ని కేసులు పెట్టినా.. ఆంక్షలు విధించినా.. అడ్డుకున్నా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతులను ఎన్నో విధాలుగా ఆదుకున్నారన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, దొాలపల్లి ఏడుకొండలు, శశికళ, బిపిన్ జైన్, జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీలు బోని బంగారునాయుడు, పాంద్రంగి శ్రీను, మండల అధ్యక్షులు బంక సత్యం, గాడుశ్రీను, కోరాడ లక్ష్మణ, నాయకులు బోని అప్పలనాయుడు, చెన్నాదాసు, వంకాయల మారుతీప్రసాద్, పోతిన హనుమంతరావు, బొడ్డు అప్పలనాయుడు, కరుణాకరరెడ్డి, అక్కరమాని రామునాయుడు, అక్కరమాని మంగరాజు, అల్లిపిల్లి నర్సింగరావు, జీరు వెంకటరెడ్డి, శిర్ల ఈశ్వరరావు, చెల్లూరి నగేష్, పొట్నూరి చంద్రశేఖర్, పల్లా రమణ, చిల్ల సూరిబాబు, కాళ్ల గౌరి, బంక శ్రీను, లంక రాంబాబు, సిరగడం దామోదరరావు, కలిమి గంగరాజు, చందక సూరిబాబు, కోరాడ వెంకట రమణరావు, గంటా శ్రీను పాల్గొన్నారు.

కొండంత బకాయి.. గోరంత చెల్లింపు

- జీవీఎంసీ కాంట్రాక్టర్లకు 'కంటితుడుపు'
- 13 నెలల బకాయిలకు గాను ఒక్క నెల బిల్లుల విడుదల
- ఇంకా రూ.380 కోట్లు చెల్లించని కూటమి ప్రభుత్వం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ కాంట్రాక్టర్ల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. సుమారు 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న రూ.420 కోట్ల బిల్లులకు గాను, కేవలం గతేడాది జూలైకు సంబంధించిన రూ.40 కోట్లను మొక్కుబడిగా చెల్లించి చేతులు దులుపుకుంది. ఈ కంటితుడుపు చర్యతో తమ కష్టాలు ఏమాత్రం తీరవని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా.. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గత ప్రభుత్వ హయాంలో ఆరు నెలలకే బిల్లులు వచ్చేవని, ఇప్పుడు ఏడాది దాటినా నిరీక్షణ తప్పడం లేదని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అప్పులు చేసి పనులు పూర్తి చేసి, నేడు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా చితికిపోతున్నామని కన్నీటిపర్యంతమవుతున్నారు. దసరా పండగ సమీపిస్తున్న వేళ.. తమ వద్ద పనిచేసిన కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని దయనీయ స్థితిలో ఉన్నామని చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'నిధి పోర్టల్' సైతం పాత బిల్లుల విషయంలో నిరుపయోగంగా మారిందని, దాని వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బకాయిల కోసం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంఎస్ఎంఈ నేషనల్ బోర్డు సభ్యుడు విష్ణుకుమార్‌రాజు, ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ టి.శివశంకర్‌ను కలిసి మొరపెట్టుకున్నట్లు తెలిపారు.

మొక్కుబడి చెల్లింపులు

ప్రభుత్వం ఎట్టకేలకు గతేడాది జూలైకు సంబంధించిన రూ.40 కోట్లను మంగళవారం విడుదల చేసిందని జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి తెలిపారు. ఇంకా రూ.380 కోట్ల భారీ మొత్తం పెండింగ్‌లోనే ఉందని వారు వెల్లడించారు. దసరా సందర్భంగా త్వరలో మరిన్ని బిల్లులు చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారని వెల్లడించారు. అయితే కాంట్రాక్టర్లలో పూర్తిస్థాయి భరోసా కనిపించడం లేదు. 'ఈ మొక్కుబడి చెల్లింపులతో మా కష్టాలు తీరవు. కనీసం ఆరు నెలల బిల్లులైనా ఒకేసారి చెల్లిస్తేనే మేం ఆర్థికంగా గట్టెక్కగలం. లేకపోతే పనులు కొనసాగించే పరిస్థితిలో కూడా లేము.' అని పలువురు కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

కేజీహెచ్‌లో కీచకులు

- వైద్యురాలిపై వార్డు బాయ్, రోగి తల్లిపై వైద్యుడి వేధింపులు
- ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని ఉన్నతాధికారులు
- మహిళా కమిషన్ దృష్టికెళ్లినా ఫలితం శూన్యం
- కూటమి ప్రభుత్వంలో మహిళల భద్రత ప్రశ్నార్థకం?



మహారాణిపేట: కేజీహెచ్‌లో కీచకుల వ్యవహారం కలకలం రేపుతోంది. రోగులు, వారి బంధువులనే కాకుండా, మహిళా వైద్యులను సైతం కొందరు వేధింపులకు గురిచేస్తున్నారు. వార్డు బాయ్‌ల నుంచి వైద్యుల వరకు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. విధి నిర్వహణలో ఉన్న ఒక వైద్యురాలి పట్ల వార్డు బాయ్, చికిత్స కోసం వచ్చిన రోగి తల్లి పట్ల ఓ వైద్యుడు అసభ్యకరంగా ప్రవర్తించడం దుమారం రేపుతోంది. ఈ ఘటనలపై బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొద్ది రోజుల వ్యవధిలోనే ఈ రెండు ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. విశేషమేమిటంటే.. ఇటు కేజీహెచ్‌కు, అటు ఆంధ్రా మెడికల్ కాలేజీకి మహిళలే సారథ్యం వహిస్తున్న తరుణంలో.. ఇలాంటి ఘటనలు జరగడం, వాటిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. ఈ ఘటనలు కేజీహెచ్ ప్రతిష్టను మసకబారుస్తున్నాయి.

వైద్యురాలిపై వార్డు బాయ్ అసభ్య ప్రవర్తన

అనస్థీషియా విభాగానికి చెందిన ఒక వైద్యురాలు.. వారానికి రెండు రోజులు (మంగళ, శుక్రవారాలు) అధికారుల ఆదేశాల మేరకు గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. అందులో భాగంగా గత నెల 26న ఉదయం 11 గంటల సమయంలో ఆమె రోగులను చూస్తుండగా.. శంకరరావు అనే వార్డు బాయ్ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఒకసారి కాదు, రెండుసార్లు.. అందరి ముందు అలా ప్రవర్తించడంతో ఆ వైద్యురాలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. ఈ విషయాన్ని ఆమె అక్కడే ఉన్న డ్యూటీ డాక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, తమ విభాగాధిపతులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అదే రోజు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐకి కూడా ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు శూన్యం.

రోగి తల్లిపై వైద్యుడి వేధింపులు

పరవాడ ప్రాంతానికి చెందిన ఒక మహిళ.. అనారోగ్యంతో ఉన్న తన కుమార్తెను తీసుకుని కేజీహెచ్‌కు వచ్చారు. సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న కుమార్తె వద్ద సహాయంగా ఉంటున్న ఆ తల్లి పట్ల ఓ వైద్యుడు అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. అతను రోగితో కాకుండా ఆమె తల్లితో అనుచితంగా మాట్లాడటంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందికి గురైంది. ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగదనే అనుమానంతో.. బాధితురాలు నేరుగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై వివరణ ఇవ్వాలని కోరుతూ మహిళా కమిషన్.. కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు గత నెల 20న ఒకసారి, ఈ నెల 4న మరోసారి లేఖలు పంపింది. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాధానం రాలేదని కమిషన్ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీహెచ్‌లో కీచకుల్లా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వంలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని.. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో మరింత మంది ఇలాగే ప్రవర్తించే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చాగంటికి కొప్పరపు కవుల జాతీయ పురస్కారం

మద్దిలపాలెం: ప్రఖ్యాత ప్రవచనకారులు, ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రతిష్ఠాత్మకమైన కొప్పరపు కవుల జాతీయ ప్రతిభా పురస్కారం–2025 అందుకున్నారు. తెలుగు భాషకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చిన ఆశుకవితా సార్వభౌములు కొప్పరపు సోదర కవుల స్మృతిలో నెలకొల్పిన కొప్పరపు కవుల కళాపీఠం 23వ వార్షికోత్సవం మంగళవారం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం సభాధ్యక్ష వహించగా.. మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ గౌరవ అతిథిగా, అమెరికాలోని లిపి సంస్థ వ్యవస్థాపకులు సాగర్ అనిసింగరాజు, మా శర్మ ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. వీరి చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ పంచభూతాల్లాగే తెలుగు భాష వెలుగొందాలని ఆకాంక్షించారు. తెలుగు వారికి ఆధ్యాత్మికత, సంస్కృతి, భాష, వారసత్వ సంపదలు గర్వించదగినవిగా ఉన్నాయని అన్నారు. విద్యార్థులకు కొప్పరపు కవుల పద్యాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని సూచించారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కొప్పరపు సోదర కవుల వంటి గొప్ప సరస్వతీ ఉపాసకుల పేరిట ఈ పురస్కారం లభించడం భగవత్ కృప అని అన్నారు. అవధానం అనేది కేవలం భాషపై పట్టుతో రాదని, సకల శాస్త్రాలు, పురాణాలపై పట్టు, సమయోచిత జ్ఞానం అవసరమని చెప్పారు. సంగీత సాహిత్య సమ్మేళనంగా జరిగిన ఈ కార్యక్రమంలో



చాగంటి కోటేశ్వరరావుకు కొప్పరపు కవుల జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

ఘోరకవి శ్రీకృష్ణ సంపత్ కుమార్, గాయని ఆలమూరు రాధా కుమారి తమ కళలను ప్రదర్శించారు. భారతీభూషణ రాంభట్ల నృసింహశర్మ సభా వ్యాఖ్యానాలు చేశారు. పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు మాచవరం వేంకట చెంచురామ మారుతి సుబ్బరాయశర్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. చాగంటి కోటేశ్వరరావుకు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు సత్కరించి, అప్పన్న అంక్షితలు అందజేశారు.



ఇది చెరువు కాదు.. జాతీయ రహదారి

గురుద్వారా జంక్షన్‌లో జాతీయ రహదారి గోతులమయంగా మారిపోయింది. చిన్నపాటి వర్షానికే నీరు చేరి అక్కడ చెరువును తలపిస్తోంది. అక్కడే బస్టాప్ ఉండడంతో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బస్సు ఎక్కే క్రమంలో పలువురు గోతుల్లో అడుగేసి పడిపోయిన పరిస్థితులు ఉన్నాయి.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్

దిగొస్తున్న ద్విచక్ర వాహనాలు

- జీఎస్టీ 2.0తో భారీగా తగ్గనున్న బైక్ ధరలు
- 350 సీసీ లోపు బైక్‌లపై 28 నుంచి 18 శాతానికి తగ్గిన జీఎస్టీ
- ఈ నెల 22 నుంచి కొత్త రేట్లు
- రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు తగ్గిస్తున్నట్లు కంపెనీల ప్రకటనలు



విశాఖ సిటీ : ద్విచక్ర వాహనాలు కొనాలనుకుంటున్నారా? రెండు వారాలు ఆగండి. జీఎస్టీ స్లాబుల సవరణతో బైక్‌ల ధరలు భారీగా తగ్గనున్నాయి. దసరా, దీపావళి పండగకు ముందే డిస్కౌంట్ల ఆఫర్లు అందుబాటులోకి రానున్నాయి. అన్ని ద్విచక్ర వాహనాలు రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు తక్కువకు లభించనున్నాయి. జీఎస్టీ రేటు సవరణతో బైక్ మార్కెట్‌లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఈ నెలాఖరు నుంచి భారీగా బైక్ విక్రయాలు జరుగుతాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపుగా అన్ని కంపెనీలు తగ్గింపు ధరలను సైతం ప్రకటించేశాయి.

350 సీసీ లోపు బైక్‌లపై భారీగా తగ్గింపు

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబులను సవరించింది. ఇందులో 350 సీసీ వరకు ఉన్న బైక్‌లపై జీఎస్టీ రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. ఈ కొత్త రేట్లు ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్నాయి. నవరాత్రి తొలి రాజు నుంచే ఈ కొత్త ధరలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో బైక్‌ల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి. వినియోగదారులు వేల రూపాయలు ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. హీరో, హోండా, టీవీఎస్, బజాజ్ వంటి కంపెనీలతో పాటు జావా, రాయల్ ఎన్‌ఫీల్డ్, యెజ్డీ బైకులు కూడా ప్రస్తుతం కంటే తక్కువ ధరకే లభించనున్నాయి. 350 సీసీ ఇంజన్ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బైక్‌ల ధరలు మాత్రం పెరగనున్నాయి. ఇప్పటి వరకు వీటిపై 28 శాతం జీఎస్టీ ఉండగా.. ఈ నెల 22వ తేదీ నుంచి 40 శాతానికి పెరగనుంది. దీంతో లగ్జరీ బైక్‌ల ధరలు మాత్రం షాక్ కొట్టనున్నాయి. ఇప్పటి కంటే రూ.20 వేల నుంచి రూ.45 వేల వరకు పెరగనున్నాయి.

ధరలు తగ్గిస్తూ ప్రకటనలు

ప్రస్తుతం విశాఖ మార్కెట్‌లో 110, 125, 150 సీసీ ఇంజన్ బైక్‌ల వినియోగమే ఎక్కువగా ఉంది. వీటి కొనుగోలుకే ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఆ తర్వాత 200, 250 సీసీ వరకు విక్రయాలు మధ్యస్తంగా ఉన్నాయి. దీంతో ఇప్పటికే వీటి ధరలు తగ్గిస్తూ కంపెనీలు కొత్త ధరలను ప్రకటించాయి. హీరో కంపెనీ బైక్‌లపై మోడల్, వేరియంట్‌ను బట్టి రూ.6 వేల నుంచి, హోండా కంపెనీ బైక్‌లపై రూ.8,500 నుంచి, టీవీఎస్ బైక్‌లపై రూ.8,700 నుంచి, బజాజ్ బైక్‌లపై రూ.8,500 నుంచి అత్యధికంగా రూ.15 వేలు వరకు తక్కువకు రానున్నాయి. అలాగే రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 సీసీ వరకు బైక్‌లపై రూ.19 వేలకు పైగా తక్కువకు లభించనున్నాయి.

మార్కెట్ జోష్

జీఎస్టీ రేట్లలో సవరణతో బైక్ మార్కెట్ జోష్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సాధారణంగా దసరా, దీపావళికి ముందు కంపెనీలు ప్రత్యేక ఆఫర్లను అందిస్తుంటాయి. కానీ ఈసారి జీఎస్టీ రేటును తగ్గించి కేంద్రం కూడా కొనుగోలుదారులకు శుభవార్త చెప్పింది. దీనికి తగ్గట్టుగానే కంపెనీలు పోటాపోటీగా తగ్గింపు ధరలను ప్రకటించాయి. ఇప్పటికే కొనుగోలుదారులు ప్రస్తుతం బైక్‌లు కొనుగోలు చేయకుండా ప్రీ బుకింగ్‌లకు సిద్ధమవుతున్నారు. సెప్టెంబర్ 22 తర్వాత కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. తద్వారా రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు తగ్గింపు పొందాలని చూస్తున్నారు. ఈ కొత్త ధరలు అందుబాటులోకి వచ్చిన తర్వాత బైక్ విక్రయాలు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇది బైక్ మార్కెట్‌కు శుభపరిణామంగా అభివర్ణిస్తున్నారు.

విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జీఎం పర్యటన

తాటిచెట్లపాలెం: దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) సందీప్ మాథుర్ విశాఖ పరిధిలోని పలు రైల్వే యార్డ్‌లలో పర్యటించారు. ముందుగా వాల్తేర్ మార్షలింగ్ యార్డ్‌లో పర్యటించి డిస్పాచ్ యార్డ్, రిసెప్షన్ యార్డ్ పనులను పరిశీలించారు. గోపాలపట్నం స్టేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి, అక్కడి నుంచి గోపాలపట్నం–జగ్గయ్యపాలెం–వడ్లపూడి గేట్ జంక్షన్ వరకు తనిఖీ చేశారు. వడ్లపూడి–దువ్వాడ(వయా గోపాలపట్నం), సింహాచలం నార్త్ స్టేషన్ల మీదుగా పర్యటించి ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న 3వ, 4వ లైన్ పనులను పరిశీలించారు. ఇంటర్‌లాకింగ్, నిర్వహణ, రైళ్ల కదలికల ప్రణాళికలపై ఆరా తీశారు. ఆయన వెంట వాల్తేర్ డివిజన్ సీనియర్ అధికారులు ఉన్నారు.

‘నేరారోపణలు ఉన్నవారికి ధర్మకర్తల పదవులా?’

సాక్షి, విశాఖపట్నం: నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా ఆలయాల ధర్మకర్తలుగా నియమితులవడం భక్తులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పోలీస్‌స్టేషన్లలో కేసులు, న్యాయస్థానాల్లో వాజ్యాలు నడుస్తున్న వ్యక్తులు ధర్మకర్తల మండలిలో పదవీ బాధ్యతలు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నగరంలోని పలు ఆలయాలకు కొత్తగా ధర్మకర్తలను నియమించారు. ఇందులో ప్రసన్న పాండురంగ స్వామి ఆలయం ధర్మకర్తగా నియమితులైన ఎ.కనకరాజుపై ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదు అయ్యి, ఎఫ్ఐఆర్ కూడా ఉంది. క్రిమినల్ కేసులు ఉన్నవారికి, ఎఫ్ఐఆర్‌లు నమోదైన వారికి ధర్మకర్తలుగా పదవులు ఇవ్వడం సరికాదని భక్తులు అంటున్నారు. వరకట్న వేధింపుల కేసును ఎదుర్కొంటున్న వ్యక్తిని ఏ ప్రాతిపదికన ధర్మకర్తగా నియమించారో అర్థం కావడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. దేవాలయాలు, ధర్మకర్తల నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అవగాహన లోపానికి ఇది ఒక ఉదాహరణగా నిలుస్తుందని.. ఎఫ్ఐఆర్‌లు ఉన్న వారు ధర్మకర్తలుగా నియమించడం సరికాదని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్‌కు జిల్లా జట్ల ఎంపిక

మద్దిలపాలెం : ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్కూల్ గేమ్స్‌కు ఉమ్మడి విశాఖ జిల్లాకు గాను అండర్–19 బాలురు, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆర్ఐవో మురళీధర్, కళాశాల క్రీడల అసోసియేషన్ కార్యదర్శి వి.ఎ.పుష్పలత తెలిపారు. 2007 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టినవారు, 6 నుంచి ఇంటర్ చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 11న పరవాడ ఎస్‌వీఎస్ పాఠశాలలో ఫెన్సింగ్, ఘట్కా, కరాటే, కుంగ్‌ఫూ, జూడోల ఎంపిక, 11న సంస్కృతి గ్లోబల్ స్కూల్లో షూటింగ్, వు–షు పోటీల ఎంపిక ఉంటుందని తెలిపారు. 12న జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ స్కూల్‌లో ఫుట్‌బాల్, నెట్‌బాల్, స్వర్ణ భారతి స్టేడియంలో బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. 13న శ్రీకృష్ణాపురంలో ఆర్చరీ, సెపక్‌తక్రా, సైక్లింగ్–రోడ్– ట్రాక్, ఏయూ గ్రౌండ్స్‌లో సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్, విశాలాక్షినగర్‌లోని బీవీకే స్కూల్‌లో మల్లకంభ్ ఎంపిక జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9440885898, 9966931556 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాంగ్‌రూట్‌లో వెళ్లి.. మృత్యుఒడికి..

వ్యానును ఢీకొని ఇద్దరి మృతి

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో ముడసర్లోవ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదం.. రెండు కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. శ్రీకృష్ణాపురంలో నివసిస్తున్న గుడ్ల గోవిందరెడ్డి (34), హరీష్ (28) ఈ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివి.. మద్దిలపాలేనికి చెందిన గోవిందరెడ్డికి భార్య, బాబు ఉన్నారు. మూడేళ్ల కిందట శ్రీకృష్ణాపురంలో అద్దె ఇంటికి వచ్చిన అతను.. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఫైనాన్స్ బకాయిలు చెల్లించలేకపోవడంతో.. ఫైనాన్స్ ఇచ్చిన వాళ్లు ఆ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అప్పటినుంచి ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నాడు. దీంతో అతని భార్య ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనికి చేరి ఇంటిని నెట్టుకొస్తోంది. సరిగ్గా పది రోజుల క్రితం.. అదే ఇంటి పైఅంతస్తులోకి హరీష్ తన భార్యతో అద్దెకు దిగాడు. హరీష్ భార్య కూడా మరో ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తోంది. హరీష్ కూడా ఖాళీగానే ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వీరిద్దరూ కలిసి స్కూటీపై ఆరిలోవ కాలనీకి వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న వారికి, బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎంచుకున్న రాంగ్‌రూటే యమపాశమైంది. అదే రోడ్డులో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు ఇటుకల లోడుతో వస్తున్న వ్యానును ముడసర్లోవ పార్కు గేటు వద్ద వీరు స్కూటీతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తలలకు తీవ్రమైన గాయాలై.. అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వ్యాన్ సైతం అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్, లా అండ్ ఆర్డర్ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారిని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఇద్దరూ ప్రాణాలు విడిచారు. వీరి అకాల మరణంపై శ్రీకృష్ణాపురం గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.


ఘటనా స్థలంలో బోల్తా పడ్డ వ్యాను


ఘటనా స్థలంలో గుడ్ల గోవిందరెడ్డి, గోవింద రెడ్డి(ఫైల్)


మృతి చెందిన హరీష్

‘కిష్కింధపురి’లో ట్విస్ట్‌లు థ్రిల్ కలిగిస్తాయి

హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఎంవీపీకాలనీ: ఈ నెల 12న విడుదలవుతున్న ‘కిష్కింధపురి’ సినిమాలో ఊహించని మలుపులు ప్రేక్షకులను అలరిస్తాయని ఆ చిత్ర హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఎంవీపీ కాలనీలో జరిగిన ప్రమోషన్ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో.. తాను హీరోగా, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా ప్రమోషన్‌ను విశాఖలో నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమైన ప్రదేశమన్నారు. ఇప్పటివరకు వచ్చిన హారర్ చిత్రాలకు భిన్నంగా ‘కిష్కింధపురి’ ఉంటుందని, కథలోని ట్విస్టులు ప్రేక్షకులకు మంచి థ్రిల్‌ను ఇస్తాయని ఆయన అన్నారు. నిర్మాత సాహు ఎక్కడా రాజీ పడకుండా సినిమాను నిర్మించారని, ఒక నిజమైన హంటింగ్ హౌస్‌లో షూటింగ్ చేయడం తమకు విభిన్నమైన అనుభూతిని ఇచ్చిందని పేర్కొన్నారు. విజువల్ ఎఫెక్ట్స్ ఈ సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. దర్శకుడు కౌశిక్ మాట్లాడుతూ ‘కిష్కింధపురి’ తెలుగులోని ఉత్తమ హారర్ చిత్రాల్లో ఒకటిగా నిలిచిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రేక్షకులందరూ థియేటర్లకు వెళ్లి సినిమాను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.

కాపర్ ప్లేట్లు దొంగిలించిన ముగ్గురి అరెస్టు

- మొత్తం సరుకు స్వాధీనం
- నాలుగు ప్లేట్లను దిమ్మలుగా తయారీ


స్వాధీనం చేసుకున్న కాపర్ దిమ్మలు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో జరిగిన కాపర్ ప్లేట్ల దొంగతనం కేసును క్రైం పోలీసులు ఛేదించారు. పోయిన ఆరు ప్లేట్లలో రెండు ప్లేట్లుగా, మిగిలిన వాటిని దిమ్మలుగా స్వాధీనం చేసుకున్నారు. బీఎఫ్–3 విభాగం పునరుద్ధరణలో తీసి స్టోర్స్‌లో భద్రపరిచిన 45 ప్లేట్లలో ఆరు కాపర్ ప్లేట్లు కనిపించలేదు. సుమారు 1,200 కేజీల బరువు ఉండే విలువైన స్టేవ్స్ దొంగతనంపై విభాగం అధికారులు గత నెల 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో అందిన సమాచారం మేరకు పోలీసులు వారం రోజుల క్రితం రెండు స్టేవ్స్‌ను సీఆర్‌ఎంపీ ఆర్‌ఈడీ స్టోర్స్ సమీపంలోని పొదల్లో గుర్తించారు. మిగిలిన నాలుగు కాపర్ ప్లేట్లు అప్పటికే గేటు దాటి బయటకు వెళ్లి చేతులు మారిపోయాయి. ఈ నాలుగు ప్లేట్లను 41 దిమ్మలుగా మార్చి వేశారు. నిందితులు రాజా (30), రామస్వామి (30)లతో పాటు స్క్రాప్ వ్యాపారి ప్రకాశ్‌లను అరెస్టు చేశారు. రాజా స్టీల్‌ప్లాంట్‌లో హైడ్రాలిక్ క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. రామస్వామి, రాజాలు పక్కా ప్లాన్‌తో లోనికి ప్రవేశించి క్రేన్‌తో ప్లేట్లను బయటపెట్టారు. అందులో నాలుగు ప్లేట్లను స్లాగ్ లారీలో స్లాగ్ కింద పెట్టి బయటకు తరలించారు. మిగిలిన రెండింటిని సమీప పొదల్లో దాచారు. ఈలోగా పోలీసులు ఈ రెండింటిని స్వాధీనం చేసుకోవడంతో మిగిలిన నాలిగింటిని దిమ్మలుగా మార్చారని క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. అంత బరువైన ప్లేట్లను తరలించాలంటే అవసరమైన భారీ యంత్రాలు సమకూర్చడంలో ఎవరి పాత్ర ఉందా? అనే అంశంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వీక్లీ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : పండగ సీజన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్–భువనేశ్వర్ న్యూ–హైదరాబాద్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. హైదరాబాద్–న్యూ భువనేశ్వర్(07165) వీక్లీ స్పెషల్ ప్రతీ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడకు, సాయంత్రం 5.15 గంటలకు న్యూ భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు అక్టోబరు 28వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో న్యూ భువనేశ్వర్–హైదరాబాద్(07166) వీక్లీ స్పెషల్ న్యూ భువనేశ్వర్‌లో ప్రతీ బుధవారం రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడకు, అదేరోజు రాత్రి 10 గంటలకు హైదరాబాద్ చేరుకుంటాయి. ఈస్పెషల్ రైళ్లు అక్టోబరు 29వ తేదీ వరకు నడుస్తాయి.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

ఏడాదిన్నర నుంచి తప్పించుకు తిరుగుతున్న అబ్దుల్ కలాం

అల్లిపురం: పోక్సో కేసులో గత కొంత కాలంగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని మహారాణిపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుడు షేక్ అబ్దుల్ కలాం సుమారు ఏడాదిన్నర కాలం నుంచి సంబంధిత కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుంటున్నాడు. అతనిపై కోర్టు నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో, పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుడు మొబైల్ ఫోన్ కూడా వాడకుండా తప్పించుకు తిరుగుతుండడంతో.. ఈ బృందాలు హైదరాబాద్‌లోని బోయినపల్లి, అలాగే అనంతపురం జిల్లాలోని గుత్తి ప్రాంతాలకు వెళ్లి గాలించాయి. చివరకు అబ్దుల్ కలాంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాయి.

గోల్డెన్ రైడ్‌తో జైపూర్ థ్రిల్లింగ్ విక్టరీ

విశాఖ స్పోర్ట్స్: నగరంలో ప్రో కబడ్డీ లీగ్ ఉత్కంఠగా సాగుతోంది. మంగళవారం జరిగిన రెండు మ్యాచ్‌లు స్థానిక క్రీడాకారులు, అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపాయి. పోర్టు స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో దబాంగ్ ఢిల్లీ తమ జైత్రయాత్రను కొనసాగించింది. మాజీ చాంపియన్ బెంగాల్ వారియర్స్‌తో జరిగిన పోరులో 45–34 తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ అషు మాలిక్ 16 పాయింట్లతో ఢిల్లీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయంతో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో దబాంగ్ అగ్రస్థానంలో నిలిచింది. జైపూర్ పింక్ పాంథర్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్ చివరి వరకు నరాలు తెగే ఉత్కంఠతో సాగింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరు జట్లు 30–30తో సమంగా నిలిచాయి. టై బ్రేకర్‌లో కూడా స్కోర్లు సమం కావడంతో, విజేతను నిర్ణయించడానికి నిర్వహించిన గోల్డెన్ రైడ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ పాయింట్ సాధించి థ్రిల్లింగ్ విజయాన్ని అందుకుంది. పాంథర్స్ రైడర్ నితిన్ 15 పాయింట్లతో జట్టు విజేతగా నిలిపాడు. బుధవారం రాత్రి 8 గంటలకు యు ముంబాతో తెలుగు టైటాన్స్, రాత్రి 9 గంటలకు యూపీ యోధాస్‌తో పునేరి పల్టన్ తలపడనున్నాయి.

ప్రతి నియోజకవర్గంలో అరకు కాఫీ షాపులు

జీసీసీ ఉత్పత్తులపై మంత్రి సమీక్ష

ఏయూక్యాంపస్: గిరిజన సహకార సంఘం (జీసీసీ) ఉత్పత్తుల బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని జీసీసీ కార్యాలయంలో మంగళవారం ఆమె చైర్మన్, డైరెక్టర్లు, ఎండీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో అరకు కాఫీ షాపులు ఏర్పాటు చేయాలని, జీసీసీ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది కొరతను తాత్కాలికంగా సచివాలయ సిబ్బందితో సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. అరకు కాఫీని ప్రపంచవ్యాప్తం చేయడానికి 18 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. జీసీసీ ప్రాంగణంలో రూ. 84 కోట్లతో 12 అంతస్తుల భవనం నిర్మించే అవకాశాలపై కూడా సమావేశంలో చర్చించారు. దీనికి సంబంధించి గతంలోనే ప్రణాళిక సిద్ధం చేశామని, ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని మంత్రి అన్నారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎండీ కల్పనా కుమారి, డైరెక్టర్లు నాగరాజు, కనకరాజు, ఇబ్రహీం, ఇతర అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు అన్యాయం

వైద్య విద్య ఖరీదుగా మారుతుందని పీడీఎస్‌వో ఆందోళన

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలోని 17 కొత్త వైద్య కళాశాలల్లో పదింటిని పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని పీడీఎస్‌వో విద్యార్థులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ.. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుకొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలను 33ఏళ్ల పాటు లీజుకు ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల సుమారు 1,500 ఎంబీబీఎస్ సీట్లు ప్రభావితమవుతాయన్నారు. ప్రైవేటీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ కోటా 50శాతం తగ్గి, మిగిలిన 50శాతం సీట్లను మార్కెట్ రేట్లకు విక్రయించడం ద్వారా ఫీజులు విపరీతంగా పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నాబార్డ్ నిధులు రూ.8,500 కోట్లతో 17 కళాశాలల నిర్మాణానికి చర్యలు తీసుకోగా.. 2023లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో కళాశాలలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024లో పులివెందుల కళాశాలను తిరస్కరించడంతో పాటు, 80శాతం నిర్మాణం పూర్తయిన పది కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను రద్దు చేయాల్సిందిగా ఎన్ఎంసీకి లేఖ రాసిందని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ.. జీవో 107, 108లను 100 రోజుల్లో రద్దు చేసి, 100 శాతం సీట్లను ప్రభుత్వ కోటాలో భర్తీ చేస్తామని చెప్పినప్పటికీ.. అధికారంలోకి వచ్చాక ఆ హామీలు నీటి బుడగలుగా మారాయని విమర్శించారు. ప్రభుత్వం పారదర్శకత లేకుండా, కన్సల్టెన్సీల ద్వారా ఈ కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్ర పన్నుతోందని ఆమె ఆరోపించారు. ఈ పీపీపీ మోడల్ విస్తరిస్తే, అన్ని ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆందోళనలో పీడీఎస్‌వో జిల్లా కమిటీ సభ్యులు జానకి, లక్ష్మణ్, లోకేష్, లైకోన్, తులసి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలే కీలకం
- 2030 నాటికి 50 మిలియన్ల కొత్త ఉద్యోగాల సృష్టిపై ‘గేమ్’ దృష్టి
- గేమ్ సహ వ్యవస్థాపకుడు మదన్

విశాఖ సిటీ : దేశంలో యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గ్లోబల్ అలయన్స్ ఫర్ మాస్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(గేమ్) పనిచేస్తోందని గేమ్ సహ వ్యవస్థాపకుడు పి.మదన్ పేర్కొన్నారు. మంగళవారం సిరిపురంలోని ది డెక్ భవనంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్)లో మీడియాతో ఆయన మాట్లాడారు. దేశంలో మాస్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఉద్యమాన్ని వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా 2030 నాటికి 50 మిలియన్ల కొత్త ఉద్యోగాల సృష్టే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఏ–హబ్ సీఈవో రవి ఈశ్వరపు మాట్లాడుతూ ఆర్‌టీఐహెచ్ ఉత్తరాంధ్ర జిల్లాల్లో యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. విశాఖలో ఈ కార్యక్రమాన్ని ఒక పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టగా.. భవిష్యత్తులో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కన్ఫెడరేషన్ ఆఫ్ వుమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షురాలు యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ ఔత్సాహికులు ఎవరైనా ఒక ఐడియాతో గేమ్‌కు వస్తే.. ఒక పారిశ్రామికవేత్తగా బ్రాండింగ్‌తో వెళ్లేంత వరకు సహాయ సహకారాలు ఉచితంగానే అందిస్తుందని తెలిపారు. సమావేశంలో నేటివ్ అరకు కాఫీ అధినేత రామ్‌కుమార్ వర్మ, గేమ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కేతుల్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న గేమ్ సహ వ్యవస్థాపకుడు పి.మదన్

లైంగిక దాడి దోషులకు శిక్ష తప్పదు

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

మహారాణిపేట: నగరంలోని సీతమ్మధార శివారులో 11 ఏళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి దురదృష్టకరమని, దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మంగళవారం ఆమె కేజీహెచ్‌లోని వన్ స్టాప్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రత్యేక స్కూల్లో చదివించే ఏర్పాట్లు చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ దాడికి పాల్పడిన ఇద్దరూ బాలురేనని ఆమె తెలిపారు. బాధితురాలి ఇంటికి సమీపంలో నివసించే వారేనని పేర్కొన్నారు. లైంగిక దాడికి గురైన బాలికకు గ్రహణం మొర్రి ఉందని చెప్పారు. తల్లిదండ్రులు పనికి వెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని శైలజ సూచించారు. కొంతమంది పిల్లలు సెల్‌ఫోన్లను చెడుకు ఉపయోగించడం వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి, ఐసీడీఎస్ అధికారి రామలక్ష్మి ఉన్నారు.

సరళీకృత జీఎస్టీ స్వాగతిస్తూ 22న రాష్ట్ర వ్యాప్త సంబరాలు

ఏయూక్యాంపస్: సరళీకృత జీఎస్టీ విధానాన్ని స్వాగతిస్తూ బీజేపీ ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు చేయనున్నట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రధాని మోదీ చిత్రపటానికి మంగళవారం కాళీమాత ఆలయం వద్ద క్షీరాభిషేకం నిర్వహించారు. సరళీకృత జీఎస్టీతో నిత్యావసరాలు, వ్యవసాయ ఉత్పత్తులు, నిర్మాణ రంగ వస్తువుల ధరలు తగ్గుతాయని, ఇది ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని ఆయన తెలిపారు. అలాగే ఈ నెల 14న రైల్వే మైదానంలో జరిగే బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సభ ‘సారథ్యం యాత్ర’ ముగింపు కార్యక్రమంగా ఉంటుందని తెలిపారు.

ధర్నా స్థలంలో మొక్కలు నాటిన స్టీల్‌ప్లాంట్

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న ఆందోళనలను కట్టడి చేయడానికి యాజమాన్యం మరో ఎత్తుగడ వేసింది. కొన్ని రోజులుగా కార్మికులు నిరసనలు చేస్తున్న ఉక్కు పైలాన్ వద్ద మొక్కలు నాటించింది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాలు కూర్మన్నపాలెంలోని ఉక్కు పైలాన్ వద్ద దీక్షలు, ధర్నాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ప్రదేశంలో ఉన్న టెంట్ కొన్ని రోజుల కిందట వర్షాలకు తడిసి కూలిపోయింది. దీనిని ఆసరాగా తీసుకున్న యాజమాన్యం.. కార్మికులు ధర్నాలు నిర్వహించే స్థలం చుట్టూ కంచె వేసింది. దీంతో కార్మిక సంఘాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆందోళనల నిర్వహణకు అనుమతి పొందాయి. ఆ అనుమతితో ఇటీవల పైలాన్‌కు ఎదురుగా ఉన్న రోడ్డులో ధర్నాను నిర్వహించాయి. అయితే యాజమాన్యం మంగళవారం పైలాన్ ప్రాంతంలో మొక్కలు నాటించింది. దీని వల్ల భవిష్యత్తులో కార్మికులు ఆ ప్రాంతంలోకి వెళ్లడానికి కూడా వీలు లేకుండా యాజమాన్యం అన్ని విధాలుగా కట్టడి చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ తాజా పరిణామంపై కార్మిక సంఘాలు ఎలా స్పందిస్తాయో చూడాలి.


కార్మికుల ఆందోళన చేసిన స్థలంలో మొక్కలు నాటిన యాజమాన్యం

మహిళల టీ20 క్రికెట్ లీగ్ విజేత విజయవాడ బ్లాస్టర్స్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర మహిళల టీ–20 క్రికెట్ లీగ్ విజేతగా విజయవాడ బ్లాస్టర్స్ నిలిచింది. వైఎస్సార్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాయలసీమ రాణీస్‌పై 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బ్లాస్టర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 165 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో మేఘన (49), మహంతి శ్రీ (37), రంగలక్ష్మి (33) రాణించారు. అంజుమ్ మూడు వికెట్లు తీసింది. 166 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాయలసీమ రాణీస్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 152 పరుగులు మాత్రమే చేయగలిగింది. రాణీస్ తరఫున గ్రీష్మ (55), అంజుమ్ (53) అర్ధసెంచరీలు చేసినా.. జట్టును గెలిపించలేకపోయారు. రిషిక మూడు వికెట్లు, అనుష రెండు వికెట్లు తీశారు. విజేతలకు భారత మాజీ క్రికెట్ కెప్టెన్ మిథాలీ రాజ్ ట్రోఫీతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు.


ఆధునిక టెక్నాలజీతో క్యాన్సర్‌కు చికిత్స

కేజీహెచ్‌లో తొలి చికిత్స విజయవంతం

మద్దిలపాలెం: కేజీహెచ్‌లో ఇటీవల ప్రారంభించిన అత్యాధునిక క్యాన్సర్ పరికరాలతో తొలి చికిత్స విజయవంతంగా జరిగింది. తీవ్రమైన గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న ఒక రోగికి మంగళవారం ఎలక్టా వెర్సా హెచ్‌డి రేడియేషన్ ఆంకాలజీ యంత్రంపై ఈ చికిత్స నిర్వహించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీతో.. కణితి ఉన్న ప్రాంతానికి మాత్రమే రేడియేషన్ ఇచ్చి, చుట్టుపక్కల ఆరోగ్యకరమైన కణాలకు ఎలాంటి హాని జరగకుండా చూడవచ్చు. దీనివల్ల రోగులకు దుష్ప్రభావాలు తగ్గుతాయి. చికిత్స మెరుగ్గా ఉంటుంది. కేజీహెచ్‌లో క్యాన్సర్ చికిత్సకు కొత్త అధ్యాయం మొదలైందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఈ సందర్భంగా రేడియేషన్ ఆంకాలజీ విభాగ వైద్యులు, సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ అధునాతన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి రావడం వల్ల రాష్ట్రంలోని క్యాన్సర్ రోగులకు ప్రపంచస్థాయి వైద్య సేవలు ఇప్పుడు కేజీహెచ్‌లోనే లభిస్తాయన్నారు. కలెక్టర్ కూడా వైద్యులను అభినందించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

బీవోబీ రూ.15 లక్షల బీమా క్లెయిమ్ చెల్లింపు

బీచ్‌రోడ్ : బ్యాంకు ఆఫ్ బరోడా–ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఏపీఎస్పీఎఫ్) మధ్య శాలరీ ప్యాకేజీ ఒప్పందంలో భాగంగా ఇటీవల సహజ మరణం పొందిన ఉద్యోగికి రూ.15 లక్షల బీమా రక్షణ కల్పించామని బ్యాంకు ఆఫ్ బరోడా విశాఖ రీజనల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ లీనా గోహైనా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఒక ఘటనలో ఏపీఎస్పీఎఫ్ కానిస్టేబుల్ కొణతాల పరమేశ్వరరావు మృతి చెందారు. ఆయనకు ద్వారకానగర్ బ్రాంచ్‌లో ఖాతా ఉంది. ఒప్పందం మేరకు బ్యాంక్ నుంచి బీమా క్లెయిమ్ ప్రాసెస్ చేసి రూ.15 లక్షల చెక్కును మంగళవారం ద్వారకానగర్ బ్రాంచ్‌లో బాధితుడి భార్య కొణతాల అన్నపూర్ణకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.మహేష్ సమక్షంలో అందజేశామని ఆమె తెలిపారు.


బీమా చెక్‌ను బాధితులకు అందిస్తున్న బ్యాంకు ఆఫ్ బరోడా రీజనల్ హెడ్ లీనా గోహైనా